క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

కొరిటిపాడు(గుంటూరు): 33 కేవీ లైన్ మెయింటెనెన్స్ దృష్ట్యా శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు టౌన్–2 డెప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎన్.గురవయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కరెంట్ ఉండదని చెప్పారు. శ్యామలానగర్, రవీంద్రనగర్, సాయినగర్, స్తంభాలగరువు తదితర ప్రాంతాల వినియోగదారులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. శనివారం ఉదయం 9 నుంచి 12.30 గంటల వరకు దేవాపురం 5వ లైన్, అశోక్ నగర్ తదితర ప్రాంతాల్లో సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు.

డిసెంబర్ జీతాలు చెల్లించాలి

లక్ష్మీపురం: విద్యుత్ మీటర్ రీడర్స్‌కు డిసెంబర్ నెల జీతాలు వెంటనే చెల్లించాలని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ సీఐటీయూ జిల్లా గౌరవ అధ్యక్షులు బి.లక్ష్మణరావు శుక్రవారం డిమాండ్ చేశారు. అధికారులు జీతం మంజూరు చేయకుండా చోద్యం చూస్తున్నారని చెప్పారు. తక్షణమే జీతం మంజూరు చేయాలని కోరారు.

ట్రిపుల్ ఎక్స్ అధినేత మాణిక్యవేల్‌కు నివాళి

లక్ష్మీపురం: ట్రిపుల్ ఎక్స్ సోప్స్ సంస్థ అధినేత మాణిక్యవేల్ అరుణాచలం(అన్నాజీ) మృతదేహాన్ని సీపీఐ నాయకులు శుక్రవారం సందర్శించి నివాళులర్పించారు. స్వయంకృషితో ఎదిగిన మాణిక్యవేల్ ఎదిగారని కొనియాడారు. నివాళులర్పించిన వారిలో రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్, నగర కార్యదర్శి కోట మాల్యాద్రి ఉన్నారు.

అన్నదాన సత్రాన్ని, ఆశ్రమాన్ని కూల్చడం అన్యాయం

లక్ష్మీపురం: కాశీనాయన జ్యోతి క్షేత్రం ఆశ్రమాన్ని, అన్నదాన సత్రాన్ని కూటమి ప్రభుత్వం కూల్చడాన్ని ఆవాజ్ కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎంఏ చిష్టి శుక్రవారం ఖండించారు. 45 ఏళ్లుగా కులమతాలకు అతీతంగా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తుండంగా ఈ ఆశ్రమం కూల్చడం దుర్మార్గమని పేర్కొన్నారు. దేవదాయ శాఖ మంత్రి రామ్ నారాయణ రెడ్డి చేసిన వ్యాఖ్యలు టైగర్ జోన్ పరిధి అనడాన్ని ఆ టైగర్లు అదానీ, అంబానీలా అని ప్రశ్నించారు. ప్రభుత్వం స్పందించి నష్ట నివారణ చర్యలుగా ఆశ్రమాన్ని పునః నిర్మించాలని డిమాండ్ చేశారు.

కారల్‌మార్క్స్‌కు ఘననివాళి

లక్ష్మీపురం: మార్క్సిస్టు మహామహోపాధ్యాయుడు కారల్ మార్క్స్ వర్ధంతి సీపీఐ నగర సమితి ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. కొత్తపేటలోని మల్లయ్య లింగం భవన్‌లో రావుల అంజిబాబు అధ్యక్షత వర్ధంతి సభ శుక్రవారం నిర్వహించారు. తొలుత మార్క్స్ చిత్రపటానికి సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్ కుమార్, నగర కార్యదర్శి కోట మాల్యాద్రి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో హమాలీ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు చల్లా చిన్న ఆంజనేయులు, సీపీఐ నాయకులు జి.సురేష్ బాబు, మంగా శ్రీనివాసరావు, చల్లా మరియదాసు, నూతలపాటి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

విపత్తులను తట్టుకోవాలి

లక్ష్మీపురం: కోవిడ్ లాంటి విపత్తులను తట్టుకునే సత్తా కలిగి ఉండాలని మేధావుల ఫోరం కన్వీనర్ పి.ఎస్.మూర్తి అన్నారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో శుక్రవారం సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి ఆధ్వర్యంలో చర్చ కార్యక్రమం నిర్వహించారు. విశ్లేషకులు ఎస్.సదాశివం, అమరాచారి, సాయిబాబు, మురళీకృష్ణ పాల్గొన్నారు.

బైక్ ఢీకొనడంతో ఇరువర్గాల ఘర్షణ

లక్ష్మీపురం: జేకేసీ కళాశాల రోడ్డులో యాక్సెస్ ద్విచక్ర వాహనంపై వెళుతున్న వ్యక్తిని మరో ద్విచక్ర వాహనం ఢీ కొనడంతో యాక్సెస్ వాహనదారుడు నిలదీయడంతో ఆ వ్యక్తి పై దాడికి పాల్పడిన ఘటన శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. పట్టాభిపురం పోలీసులు తెలిపిన వివరాలు.. ఎస్.వి.ఎన్ కాలనీకి చెందిన వెంకటరమణ బైక్‌పై వెళ్తున్నాడు. అదే రోడ్డులో చేబ్రోలు గ్రామానికి చెందిన బుట్టి, దేవేంద్ర, జాన్‌సైదులు, మరి కొంత మంది వెళ్తూ వెంకటరమణ వాహనాన్ని ఢీకొన్నారు. దీంతో వెంకటరమణ వాహనాన్ని ఢీ కొన్న వారిని నిలదీయడంతో ఒక్కసారిగా చేబ్రోలు గ్రామానికి చెందిన వారందరూ దాడికి పాల్పడ్డారు. దీంతో కొద్ది సేపు ఆ ప్రాంతంలో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. సమాచారం తెలుసుకున్న పట్టాభిపురం ఎస్ఐ నరహరి ఘటనా స్థలానికి చేరుకుని ఇరు వర్గాల వారిని స్టేషన్‌కు తరలించారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

ల్యాబ్ టెక్నీషియన్‌ల పాత్ర కీలకం

గుంటూరు మెడికల్: వైద్య రంగంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం పెరగడంతో వ్యాధి నిర్ధారణలో ల్యాబ్ టెక్నీషియన్‌ల పాత్ర కీలకంగా మారిందని గుంటూరు టౌన్ ల్యాబ్ అండ్ ఓనర్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఎం.వెంకటలక్ష్మణ్ అన్నారు. అసోసియేషన్ ఆధ్వర్యంలో ల్యాబ్ టెక్నీషియన్ డే వేడుకలు స్థానిక లక్ష్మీపురంలోని అసోసియేషన్ కార్యాలయంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి జిల్లా అధ్యక్షుడు ఆనం సంజీవరెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు.

నిప్పులు చిమ్ముతున్న బైకులు..

- నగరంలో ర్యాష్ డ్రైవింగ్‌తో రెచ్చిపోతున్న యువత
- వారిలో అధిక శాతం మైనర్‌లే....
- పెరిగిపోతున్న యువత అడ్డగోలు విన్యాసాలు
- ప్రమాదకరమైన డ్రైవింగ్.. పట్టించుకోని ట్రాఫిక్ పోలీసులు



బైక్‌లకు సైలెన్సర్లు తీసేసి ర్యాష్ డ్రైవింగ్ చేస్తున్న యువకులు(ఫైల్)

పట్నంబజారు: గాలిలో ఎగురుతున్న ద్విచక్రవాహన ముందు చక్రం.. పది బైక్‌లతో సైలెన్సర్‌లు తీసివేసి ర్యాష్ అండ్ ర్యాష్ డ్రైవింగ్.. ప్రాణాలను ఫణంగా పెట్టడంతో పాటు.. ఇతరుల ప్రాణాలను ముప్పు కలిగేలా బైక్ రేస్‌లు.. ఇదీ గుంటూరు నగరంలో పరిస్థితి. నిత్యం పోలీసులు ర్యాష్, స్నేక్ డ్రైవ్ చేస్తే సహించబోమని, బైక్ రేస్‌లపై ఉక్కుపాదం మోపుతామని చెబుతున్న మాటలు నీటిపై మాటలుగానే మారుతున్నాయి. కనీసం ఆకతాయిలు చేస్తున్న బైక్ విన్యాసాలను నిలువరించలేక పోగా కేసులు నమోదు కూడా అప్పుడప్పుడు మాత్రమే నిర్వహిస్తున్నారు.

మైనర్లు వాహనాలు నడిపే విషయంలో..

గుంటూరు నగరంలో సుమారు నాలుగు లక్షలకు పైగా ద్విచక్ర వాహనాలు ఉన్నాయి. మోటార్ వెహికల్ యాక్ట్ ప్రకారం మైనర్‌లు వాహనాలు నడపకూడదన్నది స్పష్టమైన చట్టం. అయినప్పటికీ తల్లిదండ్రుల్లో పూర్తిగా బాధ్యత కొరవడింది అనటంలో ఎటువంటి సందేహం లేదు. అందుకు నిలువెత్తు నిదర్శనాలు కళ్లముందే కనపడుతున్నాయి. చుట్టుగుంట రోడ్డులో బాలుడు ద్విచక్ర వాహనం నడుపుతూ ప్రాణాలు కోల్పోయిన ఘటన.. కాకాని రోడ్డులోని వాసవి కాంప్లెక్స్ వద్ద ఇద్దరు మైనర్లు మృత్యువాత పడ్డ ఘటన కళ్ళ ముందే ప్రాణాలు ఎంత విలువైనవో తెలియజేస్తున్నాయి. అరండల్‌పేట పోలీసుస్టేషన్ ఎదుట ఒక యువకుడు ద్విచక్ర వాహనంపై అతివేగంతో వచ్చి జారీ పడి పక్కనే డివైడర్‌పై ఉన్న చువ్వలు కడుపులోకి వెళ్లి చనిపోయిన సంఘటన చూస్తే.. ఇప్పటికీ ఒళ్లు గగ్గురపాడుస్తోంది.

చుట్టపు చూపుగా స్పెషల్ డ్రైవ్‌లు...

మైనర్‌లు, యువత, విద్యార్థుల డ్రైవింగ్ చూస్తే నగర వాసులకు భయం పుడుతోంది. కనీసం సన్నసందులు అని కూడా లేకుండా అతివేగంతో వాహనాలు నడుపుతూ ప్రమాదాలకు గురవుతున్నారు. కేవలం జనవరి ఫిబ్రవరి నెలల్లోనే ద్విచక్ర వాహనాల ప్రమాదాల్లోనే 40 మందికిపైగా మృత్యువాత పడ్డారు. అయినా లక్ష్మీపురం, బృందావన్‌గార్డెన్స్, నాజ్‌సెంటర్, కొరిటిపాడు రోడ్డులో యువత బైక్ విన్యాసాలు మితిమీరిపోతున్నాయి. బైక్ ముందుకు చక్రలాను గాలిలోకి లేపి తోలటం, సైలెన్సర్‌లు తీసేసి భారీ శబ్దాలతో ర్యాష్ అండ్ స్నేక్ డ్రైవింగ్‌లతో నగర ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. ఆరు నెలల కాలంలో ట్రాఫిక్ పోలీసులు స్పెషల్ డ్రైవ్‌లు పెట్టింది కేవలం నాలుగైదు సార్లు మాత్రమే. ఇటువంటి ఘటనలు జరుగుతున్నా.. ప్రజలు ఇబ్బందులు పాలువుతున్నా.. చుట్టపు చూపుగా స్పెషల్ డ్రైవ్‌లంటూ ఏదో ఒక రోజు హడావుడి చేసి చేతులు దులుపుకుంటున్నారు.

హైదరాబాద్ వంటి చర్యలు ఏవి...?

ఇటీవల కాలంలో హైదరాబాద్‌లో బైక్ విన్యాసాలు చేయటంతో పాటు మైనర్‌లు వాహనాన్ని నడపటాన్ని అక్కడి న్యాయస్థానం తప్పుబట్టింది. దీనిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించటంతో ఆటు, మైనర్‌లు వాహనాలు నడిపిన నేపథ్యంలో తండ్రులకు కూడా శిక్షలు విధిస్తూ.. తీర్పును జారీ చేసిన ఘటన సంచలనం రేపింది. ఈ ఘటన ఎంతో వైరల్‌గా మారింది. గతంలో వెస్ట్ ట్రాఫిక్ సీఐగా పనిచేసిన కె.వాసు, బైక్ రేస్‌లకు పాల్పడుతున్న కొంత మంది యువకులు, మైనర్‌లను అరెస్ట్ చేయటంతో పాటు వారిపై కేసులు నమోదు చేసి కోర్టుకు హాజరు పరిచిన పరిస్థితి. ఇదే మాదిరిగా చర్యలు తీసుకుంటే తప్ప ఆకతాయిల్లో మార్పు రాదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.



ముందు చక్రం గాలిలో లేపి బైక్ నడుపుతున్న యువకుడు

తల్లిదండ్రులు సహకరించాలి

మైనర్‌లకు వాహనాల ఇవొద్దని పదే పదే చెప్పినా.. అవగాహన సదస్సులు నిర్వహించిన తల్లిదండ్రుల్లో కూడా మార్పు రాకపోవటం బాధాకరం. ఇకపై కఠినతరంగా చర్యలకు ఉపక్రమిస్తాం. మైనర్‌లు వాహనాలు నడిపితే.. తల్లిదండ్రులు కూడా బాధ్యులు అవుతారన్న విషయాన్ని గుర్తించాలి. బైక్ రేస్‌లు, స్నేక్, ర్యాష్ డ్రైవింగ్ చేసే వారిపై కేసులు నమోదు చేస్తాం. కచ్చితంగా ఆకతాయిల ఆటకట్టిస్తాం.

– ఎం.రమేష్, డీఎస్పీ, ట్రాఫిక్

రైతుల భూములను ఎండోమెంట్ పరిధి నుంచి మినహాయించాలి



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి అజయ్‌కుమార్

లక్ష్మీపురం: గుంటూరు జిల్లా వట్టిచెరుకూరు మండలం చమళ్లమూడి గ్రామానికి చెందిన రైతులు సాగు చేసుకునే భూములకు సంబంధించి ఎండోమెంట్ పరిధి నుంచి మినహాయించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. కొత్తపేటలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహిచారు. ఆయన మాట్లాడుతూ మేడికొండూరు మండలం జంగగుంటపాలెం, పెదకాకాని మండలం నంబూరు, పెదకాకాని, వెనిగండ్ల తదితర గ్రామాలతో పాటు జిల్లా వ్యాప్తంగా ఉన్న రైతుల భూములను దేవదాయ శాఖ నుంచి మినహాయించాలని కోరారు. 1956 నుంచి 1998 – 2009 సంవత్సరాలలో భూములను అప్పటి మార్కెట్ రేటు చెల్లించి కొనుగోలు చేసుకుని పక్కాగా రిజిస్ట్రేషన్ పొంది ఉన్నారన్నారు. ఆనాటి నుంచి నేటి వరకు ఆ భూములలో వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నారని, ఒక ఎకరం మరియు ఒకటిన్నర ఎకరం, 1.1/2 ఎకరం భూమి గల పేద రైతులు ఉన్నారని అన్నారు. 2013లో వచ్చిన ఎండోమెంట్ చట్టం ప్రకారం వారి భూములను ఎండోమెంట్ పరిధిలోకి వస్తుందని ఆన్‌లైన్‌లో చూపిస్తుందన్నారు. వారికి 2015 వరకు బ్యాంకుల నుండి రుణ సౌకర్యం లభించిందని తెలిపారు. ఇటీవల 2016 నుంచి బ్యాంకు వారు రుణ సౌకర్యాన్ని నిలిపివేశారని చెప్పారు. వారి భూములన్నీ ఎండోమెంట్ చట్టం రాక మునుపే రిజిస్ట్రేషన్ కాబడి ఉన్నదని గుర్తు చేశారు. భూముల్ని ఎండోమెంట్ పరిధి నుంచి మినహాయించాలని ప్రభుత్వాన్ని కోరారు. సమావేశంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కొల్లి రంగారెడ్డి పచ్చల శివాజీ, ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పి.జగన్నాథం కంజుల విఠల్ రెడ్డి, రైతులు తలపనేని స్టాలిన్ పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలకు పలువురు ఎంపిక



ఉద్యోగాలు పొందిన అభ్యర్థులను అభినందిస్తున్న సందీప్, మధుసూదన్

గుంటూరు ఎడ్యుకేషన్: స్టాఫ్ సెలక్షన్ కమిషన్ ఇటీవల ప్రకటించిన ఎస్సెస్సీ సీజీఎల్ పరీక్షా ఫలితాల్లో సత్తా చాటి కేంద్ర ప్రభుత్వశాఖల్లో ఉద్యోగాలకు ఎంపికైనట్లు డైమెన్షన్స్ శిక్షణ సంస్థ డైరెక్టర్ కంభంపాటి సందీప్ తెలిపారు. బ్రాడీపేట 4/12లోని సంస్థ కార్యాలయంలో శుక్రవారం ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులను అభినందించారు. సందీప్ మాట్లాడుతూ తమ సంస్థలో అందించిన అత్యుత్తమ శిక్షణతో మైకేల్ రాజ్ ప్రకాష్ కంట్రోలర్ జనరల్ ఆఫ్ డిఫెన్స్ అకౌంట్స్ (సీజీడీఏ)లో ఆడిటర్‌గా, మరో అభ్యర్థి డీవీ జ్ఞానేశ్వర్ సెంట్రల్ బోర్డ్ ఆఫ్ డైరెక్ట్ ట్యాక్సెస్(సీబీడీటీ)లో ట్యాక్స్ అసిస్టెంట్‌గా ఉద్యోగం పొందినట్లు వివరించారు. అదే విధంగా ఇటీవల తమ విద్యార్థులు దుర్గారావు లా ఆఫీసర్, ఎం.కళ్యాణ్ యాదవ్ చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్‌లో పీవో, ఏ సూర్యప్రకాష్ ఎల్ఐసీలో ఏఏవో పోస్టుకు ఎంపికైనట్లు తెలిపారు. కార్యక్రమంలో అకడమిక్ డైరెక్టర్ ఉప్పలపాటి మధుసూదన్, అధ్యాపకులు పాల్గొన్నారు.

విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి

- సొంత గనులను కేటాయించాలి
- కార్మిక సంఘాలు డిమాండ్



లాడ్జి సెంటర్‌లో నిరసన వ్యక్తం చేస్తున్నా కార్మిక సంఘాల నాయకులు

లక్ష్మీపురం: కేంద్ర ప్రభుత్వం విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని, సొంత గనులు కేటాయించాలని, సెయిల్‌లో విలీనం చేయాలని, ఉద్యోగులకు బకాయి జీతాలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి వై.నేతాజి డిమాండ్ చేశారు. లాడ్జి సెంటర్‌లో విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కార్మిక సంఘాల సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమానికి సీఐటీయూ నాయకుడు బి.ముత్యాలరావు అధ్యక్షత వహించారు. నేతాజీ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రభుత్వ రంగ సంస్థ అయిన విశాఖ ఉక్కుకు సొంత గనులు కేటాయించాలని కేంద్రాన్ని అడగకుండా, ఇంకా ప్రారంభం కాని మిట్టల్ ప్రైవేటు ఉక్కు పరిశ్రమకు గనులు కేటాయించాలని కోరడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మేడా హనుమంతరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు విశాఖ ఉక్కు పరిశ్రమను కాపాడుకుంటామని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తరువాత దానికి భిన్నంగా వ్యవహరిస్తున్నాయని ఎద్దేవా చేశారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం రూ.11 వేల కోట్ల రూపాయలు నిధులు ఇచ్చినప్పటికీ అవి కేవలం అప్పులు తీర్చటానికే ఉపయోగించాలని షరతులు పెట్టిందంటే, అప్పులు లేకుండా చేసిన తరువాత ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టాలనే ప్రయత్నం చేస్తుందని విమర్శించారు. ఏఐఎఫ్‌టియు(న్యూ) నాయకులు కూరపాటి కోటయ్య, ఏఐకెయంఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గనిరాజు, ఏఐటీయూసీ నాయకులు బుజ్జి, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం.కిరణ్, ఏఐవైఎఫ్ నాయకులు జంగాల చైతన్య ప్రసంగించారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు బి.లక్ష్మణరావు, కె.శ్రీనివాసరావు, వై.రమణ, సీహెచ్ శ్రీనివాసరావు, షేక్ ఖాశీం వలి, షేక్ ఖాశీం షహీద్, జి.శంకరరావు, ఆర్. రాజేశ్వరరావు, కె.రాంబాబు, నాగరాజు, దీవెనరావు, బాబూరావు, ఐద్వా నగర కార్యదర్శి ఎ.కళ్యాణి పాల్గొన్నారు.

సర్వమత సమానత్వానికి ప్రతీక ఇఫ్తార్

భాష్యం చైర్మన్ భాష్యం రామకృష్ణ



ప్రత్యేక ప్రార్థనల్లో భాష్యం రామకృష్ణ, ముస్లింలు

గుంటూరు ఎడ్యుకేషన్: పవిత్ర రంజాన్ మాసంలో ఇఫ్తార్ సర్వమత సమానత్వానికి ప్రతీక అని భాష్యం విద్యాసంస్థల చైర్మన్ భాష్యం రామకృష్ణ అన్నారు. శుక్రవారం స్థానిక భాష్యం గోరంట్ల క్యాంపస్‌లో చైర్మన్ రామకృష్ణ, ముస్లింలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలు ఆచరిస్తున్న ముస్లింలు అల్లాహ్ ఆశీస్సులు పొంది ఆయురారోగ్యాలతో, సిరిసంపదలతో సంతోషంగా జీవించాలని ఆకాంక్షించారు. ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయ అరబిక్ ప్రొఫెసర్ మహ్మద్ ఇషాక్ నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల్లో రామకృష్ణ పాల్గొన్నారు. కార్యక్రమంలో భాష్యం విద్యా సంస్థల వైస్ చైర్మన్ భాష్యం హనుమంతరావు, భాష్యం మేనేజింగ్ డైరెక్టర్ భాష్యం సాకేత్ రామ్ పాల్గొన్నారు.

ఉగాది పండుగకు సంప్రదాయ వస్త్రాల ఎక్స్ పో



నగరంపాలెం: స్థానిక రింగ్‌రోడ్డు సిద్ధార్థ గార్డెన్స్ కన్వెన్షన్‌లో ది హ్యాండ్లూమ్ ఇండియా ఎగ్జిబిషన్– సేల్‌ఎక్స్ పో శుక్రవారం ప్రారంభమైంది. ఉగాది పండుగ సందర్భంగా విస్తృతశ్రేణిలో వస్త్రాల ప్రదర్శన శుక్రవారం నుంచి 16వ తేదీ వరకు కొనసాగుతోందని నిర్వాహకులు తెలిపారు. సంప్రదాయాలకు విలువనిచ్చే కొత్త సంవత్సరాది ఉగాది పండుగకు అన్నిరకాల సంప్రదాయ దుస్తులు, ఫ్యాషన్ వస్త్రాలను అందుబాటులో ఉన్నాయని చెప్పారు.

విద్యారంగ– ఆర్థిక సమస్యలపై రాష్ట్ర సదస్సు



గోడపత్రులను ఆవిష్కరిస్తున్న కె.ఎస్.లక్ష్మణరావు

గుంటూరు ఎడ్యుకేషన్: యూటీఎఫ్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 16న విజయవాడలోని మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించ విద్యారంగ, ఆర్థిక సమస్యలపై జరిగే సదస్సుని విజయవంతం చేయాలని జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు రాజశేఖర రావు,కళాధర్ ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు. శుక్రవారం గుంటూరులోని యూటీఎఫ్ కార్యాలయంలో సదస్సు గోడ పత్రిని ఆవిష్కరించారు. కార్యక్రమంలో కె.ఎస్.లక్ష్మణరావు మాట్లాడుతూ ప్రతి గ్రామంలో మోడల్ స్కూల్ ఉండేలా చూడాలన్నారు. యూటీఎఫ్ రాష్ట్ర ప్రచురణ కమిటీ చైర్మన్ ఎం.హనుమంతరావు, జిల్లా సహాధ్యక్షుడు ఎ.వెంకటేశ్వర్లు, జిల్లా కార్యదర్శులు గోవిందు, షకీలా బేగం, బెల్లంకొండ ప్రసాద్, ఆడిట్ కమిటీ సభ్యులు కోటిరెడ్డి, ప్రేమ్ కుమార్, జిల్లా కార్యవర్గ సభ్యులు రమేష్, గఫార్, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీధనలక్ష్మీ నారాయణుల కల్యాణం



శ్రీధనలక్ష్మీ నారాయణుల కల్యాణం

నగరంపాలెం: స్థానిక అరండల్‌పేట 4/2వ అడ్డ రోడ్డులోని శ్రీఅష్టలక్ష్మీ సమేత శ్రీలక్ష్మీనారాయణస్వామి దేవాలయంలో నిర్వహిస్తోన్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం శ్రీధనలక్ష్మీ నారాయణుల కల్యాణం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం అమ్మవారికి వివిధ రకాల పుష్పాలు, సుగంధ ద్రవ్యాలతో అభిషేకార్చన చేశారు. తొలుత గోపూజ, గణపతి పూజతో ప్రారంభించారు. దంపతులతో పుణ్యాహవచనం, మండపారాధన, ప్రవరలు, మహాసంకల్పంతో మంత్రార్థలను వివ రిస్తూ శ్రీధనలక్ష్మీ నారాయణుల కల్యాణం చేపట్టారు. ప్రధాన అర్చకులు మర్రిపాటి ప్రసాద్‌శర్మ, ధర్మకర్త మర్రిపాటి పార్థసారథి కార్యక్రమాలను పర్యవేక్షించారు.

శ్రీలక్ష్మీ తిరుపతమ్మ ఆలయ తిరునాళ్ల



ప్రత్యేక అలంకరణలో శ్రీలక్ష్మీతిరుపతమ్మ-గోపయ్య స్వాముల వార్లు

నగరంపాలెం: స్థానిక కొరిటిపాడు (ఆంజనేయపేట) వాకింగ్ ట్రాక్ ఎదురు వేంచేసిన శ్రీలక్ష్మీ తిరుపతమ్మ-గోపయ్య స్వాముల ఆలయ తిరునాళ్ల మహోత్సవాలు శుక్రవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం గణపతి పూజ, పుణ్యాహవాచనం, నేల పొంగళ్ళు చెల్లించుట, పోతురాజు స్వామికి నీళ్లు పోసే కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం సువాసీనులతో కుంకుమార్చన భక్తి ప్రపత్తులతో జరిపారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై, స్వామి, అమ్మవార్లను దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమాలను కన్నసాని విజయ్‌కుమార్(రాజా), రవికుమార్, బాజీ పర్యవేక్షించారు.

ముగిసిన శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలు



వేద మంత్రాలతో పుష్పయాగం

నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు శుక్రవారంతో ముగిశాయి. పద్మావతి అమ్మ వారికి విశేష అభిషేకాలు, రాత్రి వివిధ రకాల పుష్పాలు, సుగంధ ద్రవ్యాలతో పండితుల వేద మంత్రాలతో పుష్పయాగం కనులపండువగా నిర్వహించారు. హంపి శ్రీవిరూపాక్ష విద్యారణ్య పీఠాధిపతులు విద్యారణ్యభారతిస్వామి భక్తుల ఉద్దేశించి అనుగ్రహభాషణం చేశారు. భారతీ ధార్మిక విజ్ఞాన పరిషత్ నిర్వాహకులు బొల్లేపల్లి సత్యనారాయణ లలితాంబ దంపతుల ఆధ్వర్యంలో చండీహోమం నిర్వహించారు. పలు రకాల హోమ ద్రవ్యాలతో పూర్ణాహుతి చేశారు. కార్యక్రమంలో ప్రముఖ వ్యాపారవేత్త వంకాయలపాటి బలరామకష్ణయ్య, విద్యావేత్త నూతలపాటి తిరుపతయ్య, ఆలయ కమిటీ అధ్యక్షులు సీహెచ్ మస్తానయ్య, ప్రధాన కార్యదర్శి బొర్రా ఉమా మహేశ్వరరావు, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు, పుట్టగుంట ప్రభాకరరావు పాల్గొనగా, సాహితీవేత్త నోరి కోదండరామ్ వ్యాఖ్యతగా వ్యవహరించారు.







రంగుల సంబరం

ఆనందాల పండుగ హోలీ శుక్రవారం గుంటూరు పట్టణంలో భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. యువతీ, యువకులు రంగులు చిమ్ముకున్నారు. చిన్నారుల నుంచి పెద్దల వరకు రంగులలో మునిగిపోయారు. పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, గుంటూరు

భక్తిశ్రద్ధలతో వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు



నగరంపాలెం: స్థానిక ఆర్.అగ్రహారం శ్రీవెంకటేశ్వరస్వామి దేవస్థానంలో వార్షిక బ్రహ్మోత్సవాలు శుక్రవారం కొనసాగాయి. ఉదయం ప్రాతః కాల ఆరాధన, శ్రీవారికి పంచామృతాలతో అభిషేకం, అలంకార పూజ, సహస్రనామార్చన, నిత్యార్చన, నిత్య హోమం, మూలమంత్ర హవనం వంటి కార్యక్రమాలను వేదపండితులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సాయంత్రం వేళలో హోమం, బలి హరణ, ఎదుర్కోలు ఉత్సవం, రాయబారోత్సవం జరిగాయి. భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం తీర్థ ప్రసాదాలు అందించారు.

మాణిక్యవేల్ అంతిమ యాత్రలో అపశ్రుతి

బాణసంచా పేలి పలువురికి గాయాలు

లక్ష్మీపురం: ట్రిపుల్ ఎక్స్ సోప్స్ అధినేత మాణిక్యవేల్ అంతిమ యాత్రలో బాణసంచా పేలి పలువురు గాయాలుపాలైన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. అరండల్‌పేట పోలీసులు తెలిపిన వివరాలు.. మాణిక్యవేల్ మృతిచెందడంతో శుక్రవారం అంతిమ యాత్ర నిర్వహిస్తుండగా బాణసంచా కాలుస్తున్న సమయంలో అమరావతి రోడ్డులోని ఆంజనేయ పేట 3వలైన్ వద్దకు చేరుకునే సరికి ప్రమాదవశాత్తు బాణసంచా లోడ్ చేసి ఉంచిన ఆటోలో కాల్చిన టపాసులు పడటంతో మంటలు చెలరేగాయి. కంపెనీలో అటెండర్‌గా పని చేసే సుబ్బయ్య, హెల్పర్ జగన్, అంతిమ యాత్ర చూడటానికి వచ్చిన రత్నబాబు, అరిగెల శ్రీనివాసరావు గాయపడ్డారు. గాయాలు పాలైన వారిని నగరంపాలెంలోని రమేష్ హాస్పిటల్‌కి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

ఈఎంఐలు చెల్లించకుండా మోసం చేసిన వ్యక్తిపై కేసు

లక్ష్మీపురం: ఈఎంఐలు చెల్లించకుండా మోసం చేసిన వ్యక్తిపై అరండల్‌పేట పోలీసులకు శుక్రవారం కేసు నమోదు చేశారు. వివరాలు.. శ్రీనగర్‌కు చెందిన సిద్దాబత్తిని వెంకటేష్, కారును 2023 నవంబర్‌లో అతని స్నేహితుడి బంధువు అయిన నూరిశ్రీ రామచంద్రమూర్తికి వాడుకోవడానికి ఇచ్చాడు. కారు ఇచ్చే సమయంలో మిగిలిన ఈఎంఐలు రామచంద్రమూర్తి చెల్లించేలా ఒప్పందం చేసుకున్నారు. కాని ప్రతి నెల ఈఎంఐలు చెల్లించకుండా కారు తిరిగి ఇవ్వకుండా మోసం చేయడంతో బాధితుడు అరండల్‌పేట పోలీసులను ఆశ్రయించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.